క్లుప్తంగా

17న మండల సర్వసభ్య సమావేశం

తలుపుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 17వ తేదీన ఎంపీపీ రఫీ నాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

మల్లూరమ్మ దేవతకు పూజలు


అలంకరణలో మల్లూరమ్మ

ఓడీ చెరువు: మండలంలోని నారప్పగారిపల్లి వద్ద వెలసిన మల్లూరమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారప్పగారిపల్లి, నల్లగుట్లపల్లి, వడ్డివారిపల్లి, ఎం.కొత్తపల్లి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారికి పూజలు చేశారు. సర్పంచ్ శివశంకర్‌రెడ్డి మొదట పూజలు చేసి అమ్మవారికి నేవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. రాత్రికి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కాశీవిశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ట

చెన్నేకొత్తపల్లి: మండలంలోని న్యామద్దల గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీవిశ్వేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా వేద పండితులతో హోమాలు నిర్వహించి, మహాగణపతి పూజ, పూర్ణాహుతి చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. పూజల్లో రాప్తాడు సీనియర్ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీశైలం తరలిన మాలధారులు


ఇరుముడులతో వెళ్తున్న శివమాలధారులు

బత్తలపల్లి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాటికోటేశ్వరక్షేత్రం, బత్తలపల్లి ఓంకారేశ్వర దేవాలయం నుంచి ఆదివారం శివ మాలధారులు పెద్ద సంఖ్యలో ఇరుముడులతో శ్రీశైలం తరలివెళ్లారు. దాదాపు 50 మందికి పైగా మాలధారులకు గురుస్వాములు రామాంజనేయులు, రాజగోపాల్‌రెడ్డి ఇరుముడి కట్టారు. అంతకుముందు ఆయా ఆలయాల్లో అర్చకులు కేశవస్వామి లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం శివమాలధారులకు ఇరుముడి కట్టారు. ఆలయాల ప్రాంగణాలు ఓం నమఃశివాయా నామస్మరణతో మార్మోగాయి.

గుండెపోటుతో అర్చకుడి మృతి


అర్చకుడు నారాయణ మృతదేహం

నల్లచెరువు: మండల పరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయ అర్చకుడు దేవరింటిపల్లికి చెందిన నారాయణ (42) ఆదివారం గుండెపోటుతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వేడుకగా చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ట


చౌడేశ్వరి దేవి విగ్రహాన్ని పూలతో అలంకరించిన దృశ్యం

ఓడి చెరువు: మండల సరిహద్దులోని గొర్తిపల్లిలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు హోమాలు నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. బాగేపల్లి ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన్ను కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సర్వదేవతల సంగమం.. సంగమేశ్వరం

- శివరాత్రికి ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు

బత్తలపల్లి: ఎత్తుగా ఉన్న కొండలు, విశాలంగా పరుచుకున్న పంట పొలాల మధ్య ఉన్న సంగమేశ్వర క్షేత్రం పూజలతో విరాజిల్లుతోంది. ఈ క్షేత్రం బత్తలపల్లి మండలం అప్పరాచెరువు పంచాయతీ పరిధిలో వెలసింది. శనీశ్వరుడు, సీతారాముల ఆలయం, ఆంజనేయుడి ఆలయం, వేంకటేశ్వరుడు, షిర్డీ సాయిబాబా ఆలయాలతో నిండిపోవడం వల్ల ఈ క్షేత్రం సంగమేశ్వరంగా పిలువబడుతోంది. ప్రతి దేవాలయం వద్ద (ప్రముఖ పుణ్యక్షేత్రాలు) సరస్సులు ఉన్నట్లుగానే ఇక్కడ కూడా చిత్రావతి, దూబిలేరు, పాలేరు నదులు కలుస్తాయి. ఇక్కడ ప్రతిష్ఠించిన శివుడి విగ్రహం భక్తులను అమితంగా ఆకట్టుకుంటోంది. సంగమేశ్వరంలోని ఈశ్వరాలయానికి సంబంధించి కొన్ని చరిత్రాత్మక ఆధారాలున్నాయి. శ్రీకృష్ణదేవరాయల పరిపాలనా సమయంలో ఆస్థాన మంత్రికి భరణంగా ఇచ్చి అప్పాజీ పేరుతో అప్పరాజుచెర్ల గ్రామాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.

సంగమేశ్వర క్షేత్రంలో ఈ ఏడు శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇందుకోసం ముర్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 17వ తేదీన వేడుకలు ప్రారంభమై.. 19వ తేదీతో ముగియనున్నాయి. 18వ తేదీన బత్తలపల్లి, సంఘమేశ్వర క్షేత్రంలోనూ పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అదేవిధంగా సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వరక్షేత్రం, బత్తలపల్లిలోని ఓంకారేశ్వరుడి ఆలయం, దంపెట్లలోని లక్ష్మీచెన్నకేశవాలయం, మాల్యవంతం, రామాపురంలోని వీరనారాయణ స్వామి దేవాలయాల్లో సైతం వేడుకలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.


సంగమేశ్వరంలోని ఆలయం


పార్వతీ సమేత పంచలింగ సంగమేశ్వరుడు

జాగరణతో శుభాలు



శివరాత్రి పండుగ రోజు జాగరణ చేస్తే మంచి శుభ ఫలితాలు లభిస్తాయి. శివుడ్ని భక్తితో పూజించడం వల్ల అనుకున్న కార్యాలు జరుగుతాయి. మిగతా రోజులతో పోలిస్తే శివరాత్రి రోజున మహా శివుడిని ఉపవాస దీక్షలతో పూజిస్తే శివుడి అనుగ్రహం పొందవచ్చు.

- జయకుమార్, ఆలయ అర్చకుడు

ఇస్తెమా ఏర్పాట్ల పరిశీలన

కదిరి: కుమ్మరవాండ్లపల్లిలో మార్చి నెల 3, 4 తేదీల్లో జరగనున్న ఇస్తెమా ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ముస్లిం మతపెద్దలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. .సర్వ మానవాళికి మేలు చేసే ఇస్తెమా ప్రార్థనలకు తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇస్తెమాకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా పొరుగున ఉన్న చిత్తూరు, కర్నూలు, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి కూడా ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు.
కార్యక్రమంలో మాజీ మంత్రి షాకీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులపై ఆరా..

గాండ్లపెంట: కదిరి–రాయచోటి ప్రధాన రహదారి రోడ్డు విస్తరణలో భాగంగా కమతంపల్లి గ్రామ సమీపంలోని రాంబంటు చెరువు వద్ద చేపట్టిన కల్వర్టు పనులను ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఎంత మేరకు పనులు పూర్తి చేశారు? ఇంకా ఎంత మేరకు పనులు చేయాల్సి ఉంది తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ముగిసిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

ధర్మవరం: పట్టణంలోని దుర్గానగర్‌లో 5 రోజులుగా సాగుతున్న సీతలాదేవి, రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పూజలు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ బాలిరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సాకే చిన్నికృష్ణ, బెస్త రామకృష్ణ, రామాంజినేయులు, లక్ష్మీనారాయణ, రాము, పెద్ద పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

డీలర్‌కు ఆర్థిక సాయం అందజేత

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకుడు, స్టోర్ డీలర్ దేవరకొండ రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురం జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు, డీలర్లు బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా ఉండే దేవరకొండ రమేష్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరడం బాధాకరమన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పరంధామిరెడ్డి, రేషన్ డీలర్లు అజంతా కృష్ణ, బైముతక రమణ, బెస్త వెంకటరమణ, నరేష్, మోటుమర్ల రమణ, చిన్నూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న రేషన్ డీలర్లు

భక్తిశ్రద్ధలతో పాల పొంగులు

బత్తలపల్లి: మాఘ మాసం దీక్షలు చేపట్టిన పలువురు మహిళలు నాలుగో ఆదివారం ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పాల పొంగులు నిర్వహించారు. తెల్లవారుజామునే దేవాలయాలకు వెళ్లి ప్రదక్షిణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం సమీపంలోని దేవాలయాల వద్దకు వెళ్లి అక్కడ పూజలు నిర్వహించారు. అక్కడ కొత్త కుండలో నైవేద్యం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రంలోనూ, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముష్టూరు, పోట్లమర్రి శివాలయం, గంటాపురం అప్పస్వామి దేవాలయంలోనూ పాల పొంగులు నిర్వహించారు.


సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రంలో కుండకు పూజలు చేస్తున్న మహిళలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి రక్షా అకాడమీ ప్రధాన గేటు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాలమేరకు... చిలమత్తూరుకు చెందిన రవికుమార్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి బాగేపల్లి నుంచి చిలమత్తూరుకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. అయితే రక్షా అకాడమీ సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పడంతో కింద పడిపోయాడు. రవికుమార్ తలకు గాయం కావడంతో క్షతగాత్రుడికి రక్షా అకాడమీ వైద్యుడు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం అతన్ని బాగేపల్లి ఆస్పత్రికి తరలించారు.

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో ఓ యువకుడు గాయపడిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై కియా పరిశ్రమ ఎదురుగా ఆదివారం చోటు చేసుకొంది. స్థానికుల వివరాలమేరకు... ఇస్లాపురం గ్రామానికి చెందిన వడ్డి సురేష్ ద్విచక్ర వాహనంపై గుట్టూరు నుంచి పెనుకొండ వైపునకు వెళ్తున్నాడు. కియా పరిశ్రమ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనాన్ని అదుపు చేసుకోలేక ముందు వెళ్తున్న లారీని ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


తీవ్రంగా గాయపడిన సురేష్

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పెదపల్లి ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని పెడపల్లి ఉన్నత పాఠశాలలో 1987 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. మధుర జ్ఞాపకాలను పంచిన బడిని అందంగా అలంకరించి.. చదువు నేర్పిన గురువులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, భావోద్వేగానికి లోనయ్యారు. అంతకుముందు ఉదయం గురువులను డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా పాఠశాలకు తీసుకొచ్చారు. సామూహిక భోజనాలు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు రామచంద్రారెడ్డి, అత్తార్‌బాషా, రామకృష్ణ, చంద్రశేఖర్, కలీముల్లా, రవీందర్‌రెడ్డి, శివయ్య, వనజాక్షి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌కు చెందిన అశోక్‌రాజు (30) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అశోక్‌రాజు గత కొద్ది సంవత్సరాలుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చూపించినా రోగం నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలోకి వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు, బంధవులు అతడిని చికిత్స కోసం కదిరి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

26న శివాజీ మహరాజ్ శోభాయాత్ర

హిందూపురం టౌన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ శోభాయాత్ర , శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమాన్ని ఈనెల 26న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు శివాజీ సేవ ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వామి పరిపూర్ణానంద స్వామి హాజరవుతారని తెలిపారు. ఆదివారం పట్టణంలోని రాజాధాని ఫంక్షన్ హాల్‌లో శివాజీ సేవ ట్రస్ట్ సభ్యులు సమావేశమయ్యారు. శోభాయాత్రకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. శోభాయాత్ర సూగురు వద్ద ప్రారంభమై మేళాపురం వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహం వరకు సాగుతుందన్నారు.

శుభకార్యం

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ, బీడుపల్లి, గణిగవారిపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన పలు వివాహాలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి,ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, బుక్కపట్నం మండలం కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, నాయకులు రాంజీనాయక్, ఈశ్వరప్ప, మురళకృష్ణారెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్టిన్ నగర తెలుగు కల్చరల్ అధ్యక్షుడిగా పరమేశ్వర్‌రెడ్డి



ధర్మవరం అర్బన్: అమెరికా దేశంలోని ఆస్టిన్ నగర తెలుగు కల్చరల్ అధ్యక్షుడిగా ఏపీకి చెందిన సంగి పరమేశ్వర్‌రెడ్డి ఎన్నికైనట్లు ఆత్మీయ సేవా ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్లు శెట్టిపి జయచంద్రారెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్టిన్ నగరంలో తెలుగు వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రవాంసాధ్రుల్లో తెలుగు కల్చరల్ అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగిందన్నారు. సమీప ప్రత్యర్థి అయిన రవిపై 20 ఓట్ల తేడాతో పరమేశ్వర్‌రెడ్డి అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యారని పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడికి తెలుగు వారు, ఆత్మీయ ట్రస్ట్ తరపున అభినందనలు తెలిపారు.

స్వాతంత్య్ర సమయోధుల చిత్రపటాల ప్రదర్శన

కదిరి టౌన్: స్థానిక ఉర్దూ మున్సిపల్ స్కూల్‌లో జమాతే ఇస్లామి హింద్, ఈ–న్యూస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర సమయోధుల చిత్రపటాల ప్రదర్శనను ఆదివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేఎస్ బహద్దీన్, రాష్ట్ర లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్‌రెడ్డి తదితరులు తిలకించారు. స్వాతంత్య్రం కోసం పోరాడిన యోధుల సేవలను కొనియాడారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు


రైతు సుధీర్‌రెడ్డిని 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

కనగానపల్లి: పాతపాళ్యం సమీపంలో తగరకుంట రహదారిలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్న రైతు సుధీర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు.. రైతు సుధీర్‌రెడ్డి ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పాతపాళ్యం– తగరకుంట రహదారిలో క్రాసింగ్ వద్ద వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. దీనిపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

నల్లమాడ: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా పాతబత్తలపల్లికి చెందిన బీ.కృష్ణవర్ధన్ రెడ్డి, కో–కన్వీనర్లుగా దొన్నికోటకు చెందిన ఎస్.రాజశేఖర్‌నాయుడు, నల్లమాడకు చెందిన ఎస్.షాజహాన్, ఎద్దులవాండ్లపల్లి తండాకు చెందిన రమణానాయక్, ఎద్దులవాండ్లపల్లికి చెందిన టీ.సతీష్‌యాదవ్‌ను నియమించారు. తమ నియామకానికి సహకరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి సోషల్ మీడియా కన్వీనర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఐ ఉద్యోగాల పరీక్షలకు సర్వం సిద్ధం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఈనెల 19న జరగనున్న ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షలకు కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఆదివారం అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నగరంలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎస్ఎస్‌బీఎన్, ఎస్వీ డిగ్రీ కళాశాల, జేఎన్‌టీయూ, పీవీకేకే తదితర పరీక్షా కేంద్రాలకు వెళ్లి ఏర్పాట్లపై ఆయా కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడారు. డీఎస్పీతో పాటు సీఐలు రవిశంకర్ రెడ్డి, కత్తి శ్రీనివాసులు, శివరాముడు, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో మైలార లింగేశ్వరస్వామి

భక్తిశ్రద్ధలతో దోనె సేవ

అమరాపురం: మండల పరిధిలోని తమ్మేడేపల్లి గ్రామంలో కురుబ ,దళిత కులస్తుల ఆరాధ్యదైవం మైలారలింగేశ్వరస్వామికి దోనె సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో వెండి గిన్నెల్లో ఏర్పాటు చేసిన పండ్లు, పాలు, చక్కెర తదితర వాటికి దోనె సేవ పూజ నిర్వహించారు. గొరవయ్యలు నృత్యం చేస్తూ ప్రసాదాన్ని బుజ్జించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను ఊరేగించారు. తర్వాత భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.


అరటి పండ్లు భుజిస్తున్న గొరవయ్యలు


దోనె పూజ నిర్వహిస్తున్న భక్తులు